
# సింగిల్ పేజీ కథలు

## డ్రామా

రాజశేఖర్ భూగర్భజల విభాగంలో సైంటిస్టు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినా డెప్యుటేషన్ మీద రాష్ట్ర ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్నాడు. భూగర్భజలంలో ఉండే మినరల్స్ శాతాన్ని పరీక్షించడం అతని డ్యూటీ.

ఓరోజు స్కూటర్ మీద వెళుతున్నపుడు మైల్డ్ స్ట్రోక్ వచ్చి హాస్పిటల్‌లో చేర్పించినప్పుడు సుమారు నలభై వేల రూపాయల ఖర్చుతో బ్రతికి బయటపడ్డాడు. పైగా నెల్లాళ్ల విశ్రాంతి తీసుకోవల్సి వచ్చింది. దాంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు.

ఇంతలో మరో ప్రక్క అదృష్టవశాత్తూ బి గ్రేడ్



సైంటిస్టుగా ప్రమోషన్ వచ్చి తిరిగి పేరెంట్ సంస్థ అయిన కేంద్ర ప్రభుత్వ విభాగంలోకి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. లాస్ట్‌పే సర్టిఫికెట్‌తో పేరెంట్ సంస్థ డ్యూటీలో చేరిపోయాడు కూడా.

అయితే అసలు సమస్య ఇప్పుడే మొదలయింది.

మెడికల్ బిల్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టుకున్న అర్జీని సంబంధిత అధికారులు వాళ్లకి కావల్సిన పేపర్స్ ఇచ్చినా కూడా క్లియరెన్స్ క్లర్క్, అకౌంట్స్ ఆఫీసర్ నుంచి సూపరింటెండెంట్‌తో సహా ముగ్గురు కల్సి రాజశేఖర్‌తో నాలుగు స్తంభాలాట ఆడుకోవడం ప్రారంభించారు.

ఓ దశలో ఆ మెడికల్ బిల్‌కి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర పనిచేస్తున్నప్పుడు మైల్డ్ స్ట్రోక్ వచ్చింది కాబట్టి ఆ మెడికల్ బిల్‌తో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు.

అయితే పరిస్థితుల్ని అర్థం చేసుకున్న రాజశేఖర్ లౌక్యంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పది శాతం సొమ్ముని లంచంగా ఇవ్వడానికి అంగీకరిస్తున్నట్టుగా సూత్రప్రాయంగా చెప్పాడంతే, క్లియరెన్స్ క్లర్క్ నుంచి అకౌంట్స్ ఆఫీసర్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌లు ఆ మెడికల్ బిల్‌ని చకచకా పాస్ చేసేశారు.

''నీ మెడికల్ బిల్‌ని పాస్ చేయడానికి తల ప్రాణం తోకకి వచ్చిందనుకో. ఎంత కష్టపడ్డానో తెలుసా?'' అని ఎంతో శ్రమపడ్డవాడిలా ఆఫీస్ సూపరింటెండెంట్ అన్నాడు.

అయితే విషయాన్ని అర్థం చేసుకున్న రాజశేఖర్ వెంటనే జేబుల్లోంచి ఐదు వందల రూపాయి నోట్లు ఎనిమిది తీసి ఆఫీస్ సూపరింటెండెంట్ చేతికందివ్వగానే ఆయన వెంటనే డ్రాయర్‌లోంచి మెడికల్ బిల్‌కి సంబంధించిన నలభై వేల రూపాయల చెక్‌ని రాజశేఖర్‌కి ఇచ్చి ఐదు వందల రూపాయి. నోట్లని పరిశీలనగా లెక్కపెట్టుకుని ''లెక్క సరిపోయిందనుకో. ఈ ఐదు వందల నోట్లు మన ఆర్.బి.ఐ. ప్రింట్ చేసినవేనా? లేక పాకిస్తాన్ ఐఎస్ఐ నోట్లా?'' అని హాస్యమాడబోయినప్పుడు రాజశేఖర్ నిర్లక్ష్యంగా నవ్వి-

''అసలు సిసలైన ఏసిబి నోట్లు, జాగ్రత్త సుమా'' అని హెచ్చరించాడంతే. సూపరింటెండెంట్ గాభరాపడుతూ అప్పుడే జేబులో పెట్టుకోబోతున్న ఐదు వందల నోట్లని తిరిగి గబగబా రాజశేఖర్ జేబులో పెడుతూ-''ఏంటీ ఇవి ఏసిబి వాళ్ల నెంబర్లు నోట్ చేసుకున్న నోట్లా? కొంప మునుగుతుంది. ఉన్న ఉద్యోగం ఊడుతుందిగానీ నీ డబ్బుని నీ దగ్గర ఉంచుకో'' అని బాగా తడబడుతూ అన్నాడు.

నిజానికి ఇదంతా రాజశేఖర్ ఆడిన డ్రామా మాత్రమే.

**-మద్దూరి మణిప్రసాద్**
(హైదరాబాద్)

## ఆదర్శం

టైము తెల్లవారుఝాము అయిదుగంటలైంది. ట్రింగ్..ట్రింగ్.. అంటూ అదేపనిగా మ్రోగుతున్న అలారం పీస్ పీక నొక్కేసింది గౌరి విసుగ్గా బెడ్‌పై లేచి కూర్చొని. బద్ధకంగా ముసుగు తన్ని మళ్ళీ పడుకోబోయింది. కానీ తను ఆరోజునుండి వాకింగ్‌కు వెళ్ళాలని జ్ఞాపకం వచ్చింది. భర్తవైపు చూసింది. హాయిగా నిద్రపోతున్నాడు దుప్పటి నిండుగా కప్పుకొని.

"ఏమండీ! వాకింగ్‌కి వెళ్ళాలి కదా. తోడుగా వస్తానన్నారు. వస్తారా?'' అడిగింది భర్తను తట్టిలేపుతూ.

"అబ్బా, బాగా నిద్ర వస్తూందోయ్. ఈరోజు నన్ను వదిలేద్దూ'' అంటూనే గాఢనిద్రలోకి జారుకున్నాడు కరుణాకర్.

గౌరికి కూడా బద్ధకంగానే వుంది. తనూ పడుకుందామనే అనుకుంది. కాని "గౌరీ! మీరు తప్పకుండా రోజూ వాకింగ్ చెయ్యాలి'' ఫ్యామిలీ డాక్టరు లీల మాటలు గుర్తుకువచ్చాయి. ఇక ఆలస్యం చెయ్యకుండా గబుక్కున లేచింది గౌరి. బ్రష్ చేసుకుని స్వెటర్, మఫ్లర్‌తో రెడీ అయింది. ఇంకా ఆశ చావక మరొక్కసారి భర్తవైపు చూసింది తోడుగా వస్తాడేమోనని. 'ఆదమరచి నిద్రపోతున్నాడు మానవుడు' స్వగతంగా అనుకుని వాకింగ్‌కు బయలుదేరింది గౌరి.

అప్పుడప్పుడే తెలతెలవారుతూంది. చిన్నగా చలి మొదలైంది. నిర్మలమైన ఆకాశం. ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. మొదటిసారిగా వెళ్తూంది గౌరి వాకింగ్‌కి. కాస్త బెరుగ్గా, సరదాగా, క్రొత్తగా అనిపించింది ఆమెకు. చకచకా అడుగులు వేస్తూంది కాస్త వేగంగా. వీధి చివరవరకూ వెళ్ళింది. చివరి ఇంటిగేటు తెరచిన శబ్దం అయితే అటువైపు చూసింది గౌరి.

లాయర్ కమలాంబ గేటు తెరచుకొని వస్తోంది. 'బహుశా వాకింగ్‌కేనేమో' అనుకొని "గుడ్‌మార్నింగ్

లాయర్‌గారూ'' అంది గౌరి పలకరింపుగా.

''వెరీ గుడ్‌మార్నింగ్. వాకింగ్‌కు బయలుదేరారా? ఎప్పుడూ మార్నింగ్ వాక్‌లో మిమ్మల్ని చూడలేదు. ఈ మధ్యే మొదలుపెట్టారా?'' పలకరిస్తూ నడవసాగింది కమలాంబ.

''అవునండీ! మా ఫ్యామిలీ డాక్టరు నన్ను వాకింగ్ చేయమన్నారు. పిల్లలంతా సెటిల్ అయిపోయారు కదా. 'ఐడిల్'గా ఉన్నట్టనిపిస్తూంది. కాస్త ఒళ్ళు కూడా వచ్చింది. అందుకే డాక్టరు సలహా మేరకు వాకింగ్‌కు బయలుదేరాను''

''రోజూ ఈ టైముకే నేనూ వెళ్తాను వాకింగ్‌కు. జతగా వెళ్దాం రండి'' స్నేహపూర్వకంగా అంది కమలాంబ.

'హమ్మయ్య! భర్తను బ్రతిమాలవలసిన అవసరం లేదిక' అనుకుంది గౌరీ మనసులో.

కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూంటే టైమే తెలియ లేదు. అలసట కూడా అనిపించలేదు గౌరికి. ఏడు గంట లకి అంతా తిరిగి ఇల్లు చేరుకున్నారు.

రోజూ ఉదయం ఉత్సాహంగా వాకింగ్‌కు వెళ్తోంది గౌరి. కమలాం బతో మాట్లాడుతూ వెళ్తూంటే ఎన్నో మంచి విషయాలు తెలుస్తున్నాయి గౌరికి.

కమలాంబ ఒక లాయరు. భర్త నాలుగు సంవత్సరాల క్రితం హార్ట్‌ఎటాక్‌తో చనిపోయాడు. ఉన్న ఒక్క కొడుకు బెంగుళూరులో ఒక మల్టీనేషనల్ కంపెనీలో ఇంజనీరుగా ఉన్నాడు. అబ్బాయికి పెళ్ళి చేయాలనే ప్రయత్నంలో ఉంది కమలాంబ.

లాయర్ కమలాంబతో స్నేహం కించిత్తు గర్వంగా కూడా వుంది గౌరికి. ఆమె ఎన్నో విషయాలను కూలంకషంగా చర్చిస్తుంది. అన్యాయాలను, అక్రమాలను చాలా సీరియస్‌గా ఖండిస్తుంది.

ఆరోజు ఉదయం కూడా ఎప్పటిలా నడుస్తున్నారిద్దరూ. అప్పుడు తెరచిన హోటళ్ళనుండి రికార్డుల హోరు మొదలైంది. ఎదురుగా వుండే కిరాణాషాపు నుండి సుప్రభాతం గట్టిగా వినిపిస్తూంది. హోటళ్ళలోని రికార్డులు, ఈ భక్తి రంజని గొంతెత్తి కలియబడుతున్నట్ల నిపించింది గౌరికి. కమలాంబకు కూడా చాలా డిస్టర్బ్‌గా అనిపించింది.

''ఇంత ప్రశాంతమైన వాతావరణాన్ని ఎట్లా కలుషితం చేస్తున్నారో చూడండి వీళ్ళు. చుట్టుప్రక్కల వాళ్ళకు ఎంత డిస్టర్బెన్సో గమనించరు వీళ్ళు. చదువుకునే పిల్లలకు, వృద్ధులకు, పేషెంట్స్‌కు ఎంత కష్టమౌతుందో ఆలోచించరు వీళ్ళు. బొత్తిగా సివిక్‌సెన్స్ లేదండి'' ఆమె మాట పూర్తి కాకుండానే పెద్దగా హార్న్ మ్రోగిస్తూ, విపరీతమైన పొగ వదుల్తూ, వాళ్ళ ప్రక్కనుండే పెద్ద లారీ స్పీడ్‌గా వెళ్ళింది. అంతా దుమ్ముమయం. రోడ్లగురించి, వాహన కాలుష్యం గురించి, ప్రభుత్వాలు ఏమిచర్యలు తీసుకోవాలో, పౌరులంతా ఎట్లా సహకరించాలో గౌరికి అన్నీ విశదంగా చెప్పిందావిడ.


''ఎంత నిజం!'' అనుకుంది గౌరి ప్రశంసాపూర్వకంగా కమలాంబను చూస్తూ.

మరోరోజు ఉదయం నడుస్తూంటే దారిలో ఒక దృశ్యం వాళ్ళ కంటపడింది. ఒక ఇంటావిడ తన గుమ్మం చక్కగా చిమ్ముకొని, ఆ చెత్తంతా ఎదురింటి గోడకు పోసి చక్కా వెళ్ళిపోయింది.

''చూడండి గౌరి మనవాళ్ళ బుద్ధి. ఎప్పుడండీ వీళ్ళు మారేది? బొత్తిగా సివిక్ సెన్సు లేదండీ ఇండియాలో''

ఆరోజు చెత్త-శుభ్రతపై సాగింది సంభాషణ. అనర్గళంగా మాట్లాడుతున్న ఆమెను చూసి అందరూ ఆమెలా ఆలోచిస్తే ఎంత బాగుంటుంది అనుకుంది గౌరి.

ఇట్లా కొంత కాలం గడిచింది. ఆరోజు ఉదయం



నడుస్తున్నారిద్దరూ. మాటల మధ్యలో ''గౌరీ! ఇక మనిద్దరం కలిసి వాకింగ్‌కు వెళ్ళడం కుదరదు'' అంది కమలాంబ.

కంగారుగా చూసింది గౌరి ఆమెవైపు.

''అవును గౌరి! ఎందుకంటే మా అబ్బాయి అనిల్‌కు హైదరాబాద్‌కే ట్రాన్స్‌ఫర్ అయింది. వాళ్ళ కంపెనీ సోమాజిగూడలో వుంది. కంపెనీవాళ్ళే క్వార్టర్స్ ఇస్తారట. అందులోకే షిఫ్ట్ అవుతాము. ఈ ఇల్లు రెంటుకిచ్చేస్తాను'' అంది కమలాంబ. ఆమెకూ దిగులుగానే వుంది. అలవాటైన కాలనీ, అందంగా అన్ని హంగులతో వున్న స్వంత ఇల్లు విడిచి పోవాలంటే కష్టంగానే వుంది. ఆ మాటే అంది గౌరితో.

''ఎప్పుడు షిఫ్ట్ అవుతున్నారు?'' దిగులుగా అడిగింది గౌరి.

ఇంత మంచి స్నేహితురాలు దూరమౌతూందనే బాధ ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

''బహుశా వచ్చే నెలాఖరు కావచ్చు'' అంది కమలాంబ భారంగా.

ఆ 'వచ్చే నెలాఖరు' తొందరలోనే వచ్చింది. కమలాంబ ఇల్లు అద్దెకివ్వడం, క్వార్టర్స్‌కు వెళ్ళిపోవడం జరిగిపోయాయి. ఇప్పుడు ఒక్కతే వెళ్తూంది గౌరి వాకింగ్‌కు. అలవాటైపోయిందామెకు.

ఆరోజు ఎప్పటిలా ఉదయమే బయలుదేరింది గౌరి.

కమలాంబగారి ఇంటివద్దకు వచ్చేసరికి, ఇంటి ముందు మంట, పొగ కనిపించాయి. విపరీతంగా ఘాటు వాసన. ఏవో అన్నీ అట్టపెట్టెలు, మిగిలిపోయిన వ్యర్థపదార్థాలేవో కాలబెడ్తున్నాడు రెంటు వాళ్ళ పనబ్బాయి. 'ఏమై వుంటుందబ్బా' అని ఆలోచిస్తూ ముందుకుసాగింది గౌరి. అడపాదడపా ఈవిధంగా కాలబెడ్తూనే వున్నారు వాళ్ళు. వీధి అంతా పొగ, ఘాటు వాసనలతో నిండిపోతోంది. ఆ వీధిలోని ఇళ్ళవాళ్ళందరూ బాధపడ్తూ భరిస్తూనే వున్నారు.

ఒకరోజు కమలాంబగారి ఇంటిపక్కావిడ రమ కనిపించింది గౌరికి. కమలాంబగారి రెంటు వాళ్ళతో చాలా ప్రాబ్లమ్ అయిందనీ వాళ్ళు కల్తీమందులు తయారుచేస్తుంటారనీ వేస్ట్ మెటీరియల్ అంతా అట్లా తగులబెడ్తారనీ చెప్పింది.

''ఆ మంటల్లో మా చెట్లన్నీ మాడిపోతున్నాయి. పొగ, ఘాటైన వాసనలతో మా ఆరోగ్యాలు పాడవుతున్నాయి'' అంటూ వాపోయింది.

''కమలాంబగారికి ఈ విషయం తెలియదేమో! అద్దెకుండే వాళ్ళు ఈ విధంగా కల్తీమందులు తయారుచేస్తారని తెలిస్తే, వెంటనే ఖాళీ చేయిస్తుందామె!'' అంది గౌరి దృఢంగా.

''తెలిసే ఇచ్చారో, తెలియకే ఇచ్చారో ఇలాంటివాళ్ళకు రెంటుకి. మేము ఆమెకు ఫోన్ చేసి ఈ విషయాలన్నీ చెప్పాము. ఏమీ లాభం లేదండి. ఏ రెస్పాన్స్ లేదు'' అంది రమ.

నకిలీమందుల తయారీ, దానివల్ల అనర్థాల గురించి ఒకరోజు లాయర్ కమలాంబ తనతో ఆవేశంగా మాట్లాడిన మాటలు గుర్తుకొచ్చాయి గౌరికి.

''ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడే వాళ్ళను కఠినంగా శిక్షించాలండి ప్రభుత్వం. చట్టాలున్నాయి కానీ ఏం లాభం. సక్రమంగా అమలుపరిస్తే కదా. క్రిందినుండి పైస్థాయి వరకు లంచగొండితనమే'' అలా సాగిపోయిందా నాడు కమలాంబ వాక్ప్రవాహం.

అన్నిరకాల పొల్యూషన్స్ గురించి మాట్లాడే ఆ లాయరమ్మకు 'కల్తీమైండ్'ను గురించి చెప్పేదెవరు?

ఆశ్చర్యపోవడం, ఆలోచించడం గౌరి వంతయింది.

**-బాణగిరి వసుంధర**

(హైదరాబాద్)